సాక్షి
మెదక్

సోమవారం ; 29 ; జూలై ; 2024



'దారి'కొచ్చేనా?

కొమురవెల్లి మల్లన్నకు భక్తులు కానుకల వర్షం కురిపిస్తుంటే ఆలయ అధికారులు మాత్రం ఫైసలను మట్టిపాలు చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాలు 10లో ▸



తాళం వేసిన ఇంట్లో చోరీ

తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. నగదుతో పాటు బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. వివరాలు 10లో ▸



ఇదేం రోడ్డు..!

అడుగడుగునా గుంతలతో ఇదేం రోడ్డురా బాబు అంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేస్తున్నారు. వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

సీఎంను విమర్శించడం తగదు: డీసీసీ అధ్యక్షుడు



నర్సాపూర్: సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడం బీజేపీ ఎంపీ రఘునందన్ రావుకు తగదని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్‌పై అవగాహన లేకుండా సీఎం మాట్లాడారని ఎంపీ విమర్శించడం సరికాదన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపైనే సీఎం మాట్లాడారని తెలిపారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో నిధులు తేలేక పోయారని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్రం నుంచి ఆయా పథకాల కింద రావాల్సిన నిధులు తీసుకురావడానికి కేంద్ర మంత్రులు కృషి చేయాలని కోరారు.

మల్లన్న ఆలయ ఏఈఓ సస్పెన్షన్



కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ ఏఈఓ గంగా శ్రీనివాస్ సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు ఆదివారం ఈఓ బాలాజీ ఉత్తర్వులు జారీచేశారు. గత జాతరలో వీవీఐపీ పాసుల విక్రయంలో.. ఇటీవల హుండీ లెక్కింపులో జరిగిన అవకతవకలపై పోలీసులకు అధికారులు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో దేవాదాయ శాఖ అతని చర్యలు తీసుకోవాలని ఈవో బాలాజీని ఆదేశించడంతో చర్యలు తీసుకున్నారు.

ఏ తప్పు చేయలేదు: ఏఈఓ

ఆలయంలో నేను ఎలాంటి తప్పు చేయలేదని, కావాలనే కొందరు నాపై లేని పోని ఆరోపణలు చేస్తున్నారని సస్పెండ్‌కు గురైన ఏఈఓ శ్రీనివాస్ తెలిపారు. కేసులు విచారణలో ఉండగా సస్పెండ్ చేయడం సరి కాదన్నారు. నాపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని అన్నారు.

నాచగిరిలో వనమహోత్సవం



నాచగిరిలో మొక్కలు నాటుతున్న ఈఓ, అర్చకులు, సిబ్బంది

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఆదివారం వనమహోత్సవానికి వేదికైంది. పర్యావరణ హితం, క్షేత్రంలో ఆహ్లాదవాతావరణం లక్ష్యంగా ఆలయ యంత్రాంగం ఇందులో భాగస్వాములయ్యారు. ఉపాధిహామీ పథకం ద్వారా మొక్కలు సమకూరగా, తులసి వనం, పూలు, ఫల వృక్షాలతో ఆలయ సమీప వీరబాయమ్మ తోటను తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టారు. ఆలయ ఈఓ అన్నపూర్ణ ఆధ్వర్యంలో సిబ్బంది, అర్చకులు వివిధ రకాలకు చెందిన 51 మొక్కలు నాటారు. వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకున్నారు. తమ లక్ష్యం సిద్ధిస్తే స్వామివారి అర్చనకు తులసీదళాలు, పూలు, నివేదనకు ఫలాలు తోట ద్వారా సమకూరుతాయని ఈఓ పేర్కొన్నారు.

వృక్షాంబరిగా వన దుర్గమ్మ



ఏడుపాయల వన దుర్గమ్మ ఆదివారం వృక్షాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని అర్చకులు అమ్మవారిని వివిధ రకాల హరిత మొక్కలతో అలంకరించారు. హైకోర్టు ఏజీపీ ఎక్సైజ్ లక్ష్మీనారాయణ, అడ్వకేట్ రవిచంద్ర దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారి సేవలో తరించారు. - పాపన్నపేట(మెదక్)

ఫలాంబరిగా మహంకాళి



చేగుంటలోని మహంకాళి అమ్మవారు ఆదివారం భక్తులకు ఫలాంబరిగా దర్శనమిచ్చారు. పూజారి రాఘవశర్మ ఉదయం అమ్మవారిని పలు రకాల పండ్లతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి విశేష హారతి నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. - చేగుంట (తూప్రాన్)

శాకాంబరిగా నల్లపోచమ్మ



తునికి నల్లపోచమ్మ ఆదివారం భక్తులకు శాకాంబరిదేవిగా దర్శనం ఇచ్చారు. అర్చకులు అమ్మవారిని తీరొక్క కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పంచామృతాలతో అభిషేకం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని కుంకుమార్చన చేయించారు. -కొడిపల్లి(నర్సాపూర్)

ఫీవర్రీ..



జిల్లాలో నలుగురికి డెంగీ నిర్ధారణ
- అపరిశుభ్రతతో ప్రబలుతున్న రోగాలు
- ముందస్తు చర్యలతోనే ఆరోగ్యం పదిలం

చేగుంట మండలం జిత్రం తండాలో ఇటీవల ఒకే ఇంట్లో ముగ్గురికి డెంగీ సోకినట్లు తెలిసింది. వారిలో ఇద్దరు పెద్దవారు కాగా ఒకరు (నెలరోజుల) పసిపాప ఉంది. విషయం తెలుసుకున్న వైద్యారోగ్యశాఖ అధికారులు ఆ ఇంటి చుట్టూ పరిసరాలను పరిశీలించారు. ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా ఉంది. వారితో పాటు ఆ తండాలో 70 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు.

రామాయంపేట మండలం సుతారిపల్లిలో గిరిజనులు విష జ్వరాలతో సతమతం అవుతున్నారు. కీళ్ల నొప్పులు, చలి జ్వరంతో మంచం పట్టారు. మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసిన వైద్యాధికారులు రక్త పరీక్షలు చేయగా వారిలో ఒకరికి డెంగీగా నిర్ధారణ అయింది. అపరిశుభ్రతతోనే ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

మెదక్‌జోన్: వైరల్ జ్వరాలతో ప్రజలు సతమతం అవుతున్నారు. జిల్లాలో ఇటీవల నలుగురికి డెంగీ నిర్ధారణ కాగా, అపరిశుభ్రతతోనే ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అధికారులు చెబుతున్నారు. తాగి పారేసిన కొబ్బరి బోండాలు, టీ కప్పులు, టైర్లు, కుండీలలో రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో దోమల వ్యాప్తి పెరుగుతోంది. అలాగే ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి గుంతలు ఉన్నా వాటిలో లార్వా పెరిగి దోమలు వృద్ధి చెందుతాయి. ప్రతి శుక్రవారం గ్రామాలు, పట్టణాల్లో, ముఖ్యంగా గిరిజన తండాల్లో ఏఎన్ఎంలు, ఆశాలతో పాటు పంచాయతీరాజ్, ఇతరశాఖల అధికారులు సంయుక్తంగా తిరుగుతూ డ్రై డే పాటించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఎప్పుడూ లేని విధంగా ఈసారి ఇంటింటి జ్వర సర్వే చేస్తున్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడిన వారికి వెంటనే మందులు పంపిణీ చేస్తున్నారు.

ఏడుపాయలపై దృష్టి సారించాలి

జిల్లాలో ముఖ్యంగా ఏడుపాయల దేవస్థానంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇక్కడికి ప్రతి ఆది, మంగళవారాల్లో భక్తులు వేల సంఖ్యలో వస్తుంటారు. వారిలో నూటికి 98 శాతం మాంసాహారం తీసుకుంటారు. తిను బండారాలు ఎక్కడ పడితే అక్కడ పారేయడంతో పాటు ఏడుపాయల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో నీరు ఎక్కడ పడితే అక్కడ నిల్వ ఉంటుంది. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పరీక్షలు చేస్తున్నారా..?

2021 నుంచి ఇప్పటివరకు జిల్లాలో కేవలం ఐదు మలేరియా కేసులు మాత్రమే నమోదు అయినట్లు ఇటీవల కలెక్టర్ నిర్వహించిన సమీక్షలో వైద్యాధికారులు చెప్పారు. అనుమానం వచ్చిన కలెక్టర్ జ్వర పీడితులకు రక్త పరీక్షలు చేస్తున్నారా..? చేస్తే మూడేళ్లలో ఐదుగురికి మాత్రమే మలేరియా వస్తుందా ..? అంటూ ప్రశ్నించినట్లు తెలిసింది. ఇక నుంచి అలా జరగకూడదని, ఇంటింటా జ్వర సర్వే నిర్వహించి ఏమాత్రం అనుమానం వచ్చినా రక్త పరీక్షలు చేయాలని ఆదేశించినట్లు చెప్పారని సమీక్షలో పాల్గొన్న ఓ ఉన్నతాధికారి తెలిపారు. అయితే డెంగీ మాత్రం 2021 నుంచి ఇప్పటివరకు 118 కేసులు నమోదయ్యాయి.

రక్త నమూనాలు సేకరిస్తున్నాం

జిల్లావ్యాప్తంగా నెలకు ఐదు వేల రక్త నమూనాలు సేకరించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. జ్వర సర్వే జరుగుతున్న నేపథ్యంలో ఏ మాత్రం అనుమానం వచ్చినా వెంటనే ఆ వ్యక్తి రక్తం సేకరించి ల్యాబ్‌కు పంపాలని చెప్పాం. జిల్లాలో 220 మంది ఏఎన్ఎంలతో పాటు 40 మంది సూపర్‌వైజర్లు ఉన్నారు. ఒక్కొక్కరు నెలకు 20 మందికి రక్త పరీక్షలు చేసినా, ఐదు వేల పైచిలుకు రక్త నమూనాల సేకరణ జరుగుతోంది.

- శ్రీరాం, జిల్లా వైద్యాధికారి

30న రెండో విడత రుణమాఫీ

కలెక్టర్ రాహుల్‌రాజ్



మెదక్ కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు రుణమాఫీ రెండో విడత ఈనెల 30న విడుదల చేయనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. అదే సమయంలో మెదక్ కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం ఉంటుందన్నారు. రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యవసాయ, సహకార శాఖ, బ్యాంకు సిబ్బంది కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

ఎంపీడీఓ వర్సెస్ కార్యదర్శి

- ఇద్దరి మధ్య మాటల యుద్ధం



ఎంపీడీఓ సీతారావమ్మ, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర మధ్య వాగ్వాదం

రేగోడ్(మెదక్): ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి మధ్య మాటల యుద్ధం జరిగింది. రేగోడ్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది సాక్షిగా శనివారం జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని గజ్వాడ పంచాయతీ కార్యదర్శి నరేంద్ర విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో పాటు అధికారులు నిర్వహించే సమావేశాలకు సైతం రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. జనవరి నుంచి ఇప్పటివరకు 16 సమావేశాలు నిర్వహిస్తే ఒక సమావేశానికి మాత్రమే వచ్చారని సమాచారం. విధులకు సక్రమంగా హాజరుకావాలని ఎంపీడీఓ సీతారావమ్మ కార్యదర్శికి పలుమార్లు సూచించారు. అయినా పనితీరులో మార్పు రాకపోవడంతో ఈనెల 13న డీపీఓ కార్యాలయానికి సరెండర్ చేశారు. ఇదే విషయమై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరిగింది. నాకు తెలియకుండా సరెండర్ చేసి, వేతనం ఎందుకు కట్ చేశారని కార్యదర్శి ప్రశ్నించారు. దీంతో ఆగ్రహానికి గురైన ఎంపీడీఓ బయటకు వెళ్లాలంటూ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కసారన్నా పంచాయతీకి వచ్చావా..? అని నిలదీశారు. సరెండర్‌తో ఊరుకుంటున్నా.. లేదంటే సస్పెండ్ చేస్తా అని హెచ్చరించారు. ఇదే విషయమై కార్యదర్శి నరేంద్ర మాట్లాడుతూ.. సక్రమంగానే విధులకు వెళ్తున్నానని, ఎంపీడీఓ ఒక్కసారి కూడా గ్రామానికి రాలేదన్నారు. మెమోలు ఇచ్చినా పనితీరులో మార్పు రాకపోవడంతో గ్రామస్తులు ఫిర్యాదు మేరకు కార్యదర్శిని డీపీఓ కార్యాలయానికి సరెండర్ చేశానని ఎంపీడీఓ సీతారావమ్మ చెప్పారు.

త్వరలో 'యువజన కాంగ్రెస్' ఎన్నికలు

- ప్రతి కార్యకర్త సిద్ధం కావాలి
- సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి
- టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్‌రావు



మాట్లాడుతున్న బండారు శ్రీకాంత్‌రావు

గజ్వేల్: సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అలాగే యువజన కాంగ్రెస్ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం గజ్వేల్ మండలం జాలిగామలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. యువజన కాంగ్రెస్ ఎన్నికలు పార్టీకి ప్రతిష్టాత్మకమని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి యువజన కాంగ్రెస్ కార్యకర్త ఎన్నికల్లో పాల్గొనే విధంగా చూడాలన్నారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన సమాచారం అందరికీ అందుతుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కూడా కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, నాయకులు గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మకు బోనం



బోనం తీసుకొస్తున్న కలెక్టర్ దంపతులు



తుప్రాన్ పట్టణంలో బోనాల సందడి

తూప్రాన్/చేగుంట: ఆషాఢ మాసం బోనాలతో జిల్లావ్యాప్తంగా సందడి నెలకొంది. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. డప్పు చప్పుళ్ల నడుమ మహిళలు బోనాలతో ఆలయాల వద్దకు ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. తూప్రాన్ పట్టణంలోని మహంకాళి దేవాలయంలో బోనాల ఉత్సావాలను మున్సిపల్ చైర్‌పర్సన్ మామిళ్ల జ్యోతి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సీఐ రంగకృష్ణ, ఎస్ఐ శివానందం తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే చేగుంట మండలంలోని వడియారం, కర్నాల్‌పల్లిలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలైన నల్లపోచమ్మ, దుర్గమ్మకు మహిళలు బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



చేగుంట: కర్నాల్‌పల్లిలో బోనాలతో మహిళలు

కలెక్టర్ ప్రత్యేక పూజలు

మెదక్‌మున్సిపాలిటీ: కలెక్టర్ రాహుల్‌రాజ్ కుటుంబ సమేతంగా ఆదివారం పట్టణంలోని తారక రామనగర్ కాలనీలోని నల్లపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు పండి, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు.

హాఫ్ మారథాన్ అదుర్స్

- జనసంద్రమైన రంగనాయక సాగర్
- ఉత్సాహంగా పాల్గొన్న అథ్లెట్స్
- రన్‌ను ప్రారంభించిన ఎంపీ రఘునందన్ రావు



రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు



రంగనాయక సాగర్‌పై హాఫ్ మారథాన్‌లో పాల్గొన్న యువత

చిన్నకోడూరు(సిద్దిపేట): రంగనాయక సాగర్ కట్ట జనసంద్రమైంది. హాఫ్ మారథాన్ అదుర్స్ అనిపించింది. మండల పరిధిలోని చంద్లాపూర్ శివారులోని రంగనాయక సాగర్ రిజర్వాయర్ కట్టపై ఆదివారం హాఫ్ మారథాన్ నిర్వహించారు. జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి అథ్లెట్స్ రన్‌లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన హాఫ్ మారథాన్‌ను ఎంపీ రఘునందన్‌రావు జెండా ఊపి రన్ ప్రారంభించారు. 3 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా.. సుమారు 2,500 మందికి పైగా పాల్గొన్నారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అన్నివయస్సుల వారు రన్‌లో పాల్గొన్నారు. 5కే, 10కే, 21కేలో మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

విజేతలు వీరే..

హాఫ్ మారథాన్‌లో గెలుపొందిన విజేతలకు మూడు విభాగాల్లో పురుషులు, మహిళలకు వేర్వేరుగా బహుమతులు అందజేశారు. 21కేలో మొదటి బహుమతి యుగేందర్ యాదవ్, ద్వితీయ రమేశ్ చంద్ర, తృతీయ బహుమతి సోనూ కుష్వా పొందారు. మహిళా విభాగంలో మరిపల్లి ఉమ, వడ్డె నవ్య, మద్దూరి కావ్యలు, 10 కేలో పంకజ్ సింగ్, సునిల్ కుమార్, మహేష్, మహిళా విభాగంలో మహేశ్వరి, స్వప్న, రాజేశ్వరి, 5కేలో చంద్రశేఖర్, సామ్యూల్, ఈశ్వర్‌లు, మహిళా విభాగంలో ఇందు, రవళి, నిరీక్షణలు బహుమతులు గెలుచుకున్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి..

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని.. లేదంటే జీవితాలు పాడవుతాయని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. హాఫ్ మారథాన్ ప్రారంభం అనంతరం ఆయన మాట్లాడారు. యువత మాదక ద్రవ్యాల వైపు మొగ్గు చూపకూడదని, విద్యా, ఉద్యోగాల వైపు మొగ్గు చూపి తమ భవిష్యత్తును నిలబెట్టుకోవాలన్నారు. ప్రతి రోజు యోగా ఆసనాలు, రన్నింగ్, వాకింగ్, వ్యాయామం చేయడం ఆరోగ్యానికి మంచిదన్నారు. ప్రతి ఒక్కరూ రోజు గంట సమయం వాకింగ్‌కు కేటాయించాలన్నారు.

12 మారథాన్‌లలో పాల్గొన్నా..



ఇప్పటి వరకు 12 మారథాన్‌లలో పాల్గొన్నా. సిద్దిపేటలో ఇది రెండో సారి పాల్గొన్నా. చాలా ఆనందంగా, సంతోషంగా ఉంది. హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, చెన్నై, పాట్నా తదితర ప్రాంతాల్లో నిర్వహించిన మారథాన్‌లో పాల్గొన్నా. 73 ఏళ్ల వయస్సులో చాలా ఆరోగ్యంగా ఉన్నా.

–నాగభూషణం,
రిటైర్డ్ ఉద్యోగి, హైదరాబాద్

క్లుప్తంగా

పార్ట్‌ టైం జాబ్‌ పేరుతో సైబర్‌ మోసం

● రూ.93 వేలు పోగొట్టుకున్న బాధితుడు



పటాన్‌చెరుటౌన్‌: పార్ట్‌టైం జాబ్‌ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్‌ మెసేజ్‌కు స్పందించి ఓ వ్యక్తి రూ.93 వేలు పోగొట్టుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని సాయిరాంనగర్‌ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి ఉద్యోగికి పార్ట్‌టైమ్‌ జాబ్‌ అంటూ వాట్సాప్‌కు 23వ తేదీన మెసేజ్‌ వచ్చింది. ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. సైట్‌ నిర్వాహకులు అతడికి వ్యాలెట్‌ ఐడీ క్రియేట్‌ చేసి ఇచ్చాడు. ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్క్‌లు పూర్తి చేశాడు. బాధితుడు మొత్తం రూ. 93 వేలు చెల్లించాడు. సైబర్‌ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వ్యాలెట్‌లో నగదుతోపాటు కమీషన్‌ నగదు చూపిస్తూ వచ్చారు. చివరిగా తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్‌ ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్‌ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాల్వలోకి దూసుకెళ్లిన కారు

● తప్పిన పెను ప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

నారాయణఖేడ్‌: కాల్వలోకి కారు దూసుకెళ్లిన ఘటన నిజాంపేట మండలం మునిగేపల్లి వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటకలోని బీదర్‌ జిల్లా ఔరాద్‌కు చెందిన ప్రశాంత్‌, బాబూరావు కొన్నేళ్ల కింద హైదరాబాద్‌ కూకట్‌పల్లి హౌజింగ్‌ బోర్డు కాలనీలో స్థిరపడి ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యులుగా పని చేస్తున్నారు. ప్రతీ ఆదివారం ఔరాద్‌ వెళ్లి అక్కడి ప్రైవేటు ఆస్పత్రిలో దంత వైద్య సేవలు అందిస్తుంటారు. ఆదివారం ఔరాద్‌కు కారులో వెళ్తుండగా మునిగేపల్లి సమీపంలోని మలుపు వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న కాల్వలోకి దూసుకెళ్లింది. కారులోని బెలూన్లు తెరచుకోవడంతోపాటు సమీపంలోని రైతులు సకాలంలో స్పందించి అక్కడకు చేరుకొని అద్దాలు పగులగొట్టి ఇద్దరినీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. కాల్వలోకి దూసుకెళ్లిన కారును జేసీబీతో సాయంతో బయటకు తీయించారు.

ఐక్యంగా ఉండి సమస్యలు సాధించుకోవాలి



మాట్లాడుతున్న రాజేశ్వర శర్మ

చిన్నశంకరంపేట(మెదక్‌): దూప దీప నైవేద్య అర్చకుల సంఘం సమస్యలు సాధించుకునేందుకు ఐక్యంగా పోరాడాలని సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర శర్మ అన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లిలో ఆదివారం అర్చక సంఘం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సంవత్సరం జిల్లాలో గత కమిటీ ఆధ్వర్యంలోనే సంఘం నడుస్తుందని తెలిపారు. త్వరలోనే అన్ని గ్రామాల్లో ధూపదీప నైవేద్య పథకం అమలు జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు చంద్రశేఖర్‌, బసవలింగప్ప, కోశాధికారి ప్రవీణ్‌, శ్యామ్‌సుందర్‌, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

‘దారి’కొచ్చేనా?

● మల్లన్న పైసలు మట్టిపాలు
● దాసారం గుట్టపైకి రోడ్డు పేరుతో రూ.4.40 కోట్లు వృథా
● మరిన్ని డబ్బులు ఇస్తేనే రోడ్డు పూర్తి
● భక్తులకు తప్పని ఇబ్బందులు



దాసరం గుట్టపైకి వేస్తున్న అప్రోచ్‌ రోడ్డు

కొమురవెల్లి(సిద్దిపేట): కోరిన కోర్కెలు తీర్చే కొమురవెల్లి మల్లికార్జున స్వామికి భక్తులు కానుకలతో కనుక వర్షం కురిపిస్తుంటే ఆలయ అధికారులు మాత్రం మల్లన్న పైసలను మట్టిపాలు చేస్తున్నారని భక్తులు, స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా..

కొమురవెల్లి మల్లన్న ఆలయ సమీపంలో దాసరం గుట్ట ఉంది. దానిపైకి రోడ్డు లేదు కానీ గత ప్రభుత్వంలో తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌, మల్లారెడ్డిల చొరవతో దాసరం గుట్టపై డోనర్‌ స్కీం కింద వసతి గదులు నిర్మించాలనే ఆలోచనతో దాసారం గుట్టపైకి అప్రోచ్‌ రోడ్డు వేయాలని నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా రూ.1.40 లక్షలతో 2019లో పనులను ఆనాటి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఆ డబ్బులతో పనులు పూర్తి కాకపోవడంతో ఆలయ అధికారులు మరో రూ.3 కోట్లను ఆలయం నుంచి చెల్లించారు. మొత్తం రూ.4.40 కోట్లు వెచ్చించినా రోడ్డు పూర్తి కాలేదు. రోడ్డు పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉండడంతో స్థానికులు మల్లన్న డబ్బులను ఆలయ అధికారులు వృథా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. సదరు కాంట్రాక్టర్‌ మాత్రం ఆ రోడ్డు పూర్తి కావడానికి మరో రూ.కోటి 80 లక్షలు ఇవ్వాలని ఆలయ అధికారులను అడిగినట్లు సమాచారం.

నిర్మాణానికి కొంతే అనుకూలం..

దాసరం గుట్ట అప్రోచ్‌ రోడ్డుకు ఖర్చు చేసిన డబ్బులతో ఆలయ పరిసరాల్లో వసతి గృహాలు నిర్మాణం చేపడితే భక్తులకు ఉపయోగకరంగా ఉండేవని స్థానికంగా చర్చ జరుగుతుంది. ఇంత డబ్బులు ఖర్చు పెట్టినా గుట్టపై కేవలం 2,000 గజాల భూమి మాత్రమే నిర్మాణానికి అనుకూలంగా ఉంటుందని ఆశించినంత ఫలితం లేదని, ఆలయ అధికారుల పని తీరు చారణాకోడికి భారణ ఖర్చు చేసినట్లు ఉందని స్థానికంగా విమర్శలు వస్తున్నాయి.

ప్రభుత్వ అనుమతి కోసం పంపించాం



దాసరం గుట్టపైకి రోడ్డు వేసేందుకు ఇప్పటి వరకు రూ.4 కోట్ల 40 లక్షలు కాంట్రాక్టర్‌కు ఆలయం తరఫున చెల్లించాం. పనులు పూర్తి కావడానికి మరో రూ.1.80 లక్షలను కాంట్రాక్టర్‌ అడుగగా ప్రభుత్వానికి నివేదిక తయారు చేసి పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే మళ్లీ పనులను ప్రారంభిస్తాం.

– బాలాజీ శర్మ, ఆలయ ఈవో

భారీ అవినీతి జరిగింది



దాసరం గుట్టపైకి నిర్మాణం చేసే రోడ్డు పనులలో భారీ అవినీతి జరిగింది. దేవాదాయ శాఖ కమిషనర్‌ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి మిగితా డబ్బులు మంజూరు చేయాలి. దేవుని సొమ్మును వృథా చేయకుండా భక్తుల సంక్షేమం కోసం ఉపయోగించాలి.

– తేలు ఇస్తారి, స్థానికుడు

నారు.. రైతన్నల జోరు









రైతన్నలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. సంగారెడ్డి జిల్లాలో వారం రోజులుగా ఆగకుండా చినుకులు పడటంతో పొలం పనులు జోరందుకున్నాయి. ఎక్కడ చూసినా వరి నాట్లు దర్శనమిస్తున్నాయి. పొలాల్లో మడులు కట్టి నీళ్ల నింపారు. భూమి వదులుగా కావటానికి, చదునుగా ఉండటానికి ట్రాక్టర్‌ వేస్తున్నారు. ఎరువులు చల్లుతున్నారు. నారు తెచ్చి మడుల్లో వేస్తున్నారు. మహిళలంతా పాటలు పాడుతూ నాట్లు వేస్తున్నారు.

– స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, సంగారెడ్డి

ఏసయ్య మందిరంలో ప్రార్థనలు



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) దైవ సందేశమిస్తున్న ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య

మెదక్‌జోన్‌: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్‌ సీఎస్‌ఐ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు కొనసాగాయి. రెండు దఫాలుగా ప్రార్థనలు జరిగాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి ఆరాధన, 2వ ఆరాధన ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాగింది. ఈ సందర్భంగా చర్చి ప్రెసిబెటరి ఇన్‌చార్జి శాంతయ్య ప్రత్యేక ప్రార్థనలు చేసిన ఆయన దేవుడి సందేశాన్ని ఇచ్చారు. కాగా దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్చి నిర్వాహకులు అన్ని ఏర్పాటు చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

● రూ.1.77లక్షల నగదు, 4 తులాల బంగారం, 70 తులాల వెండి అపహరణ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కొడిపల్లి(నర్సాపూర్‌): తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. నగదుతోపాటు బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన కొడిపల్లి మండలం తిమ్మాపూర్‌లో చోటు చేసుకుంది. ఆదివారం ఎస్‌ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి, బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వెంకగోని అంజాగౌడ్‌కు గ్రామంలో చిన్న కిరాణాషాపు ఉంది. శనివారం కామారెడ్డి జిల్లా పెద్దమల్‌రెడ్డి గ్రామంలో అతడి సడ్డకుడు అనారోగ్యంతో ఉండటంతో కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. ఆదివారం ఉదయం ఇంటి వాకిలి ఊడ్చేందుకు వచ్చిన పని మనిషికి తలుపు తీసి ఉండటంతో గ్రామస్తులు, అంజాగౌడ్‌, పోలీసులకు సమాచారం ఇచ్చింది. గుర్తు తెలియని వ్యక్తులు బీరువా తాళం పగులగొట్టి రూ.1.77 లక్షల నగదు, 4 తులాల బంగారు ఆభరణాలు, 70 తులాల వెండి చోరీ చేసినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న నర్సాపూర్‌ సీఐ జాన్‌రెడ్డి, కొడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌ కుమార్‌ రెడ్డి, పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి విచారణ చేశారు. బాధితుడు అంజాగౌడ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అడ్రస్‌ అడుగుతూ బంగారం చోరీ

ఇద్దరిని అరెస్ట్‌ చేసిన పోలీసులు

పటాన్‌చెరు టౌన్‌: చైన్‌ స్నాచింగ్‌ కేసులో పోలీసులు ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఆదివారం అమీన్‌పూర్‌ సీఐ సదా నాగరాజు కథనం మేరకు.. అమీన్‌పూర్‌ పీఎస్‌ఆర్‌ కాలనీకి చెందిన అశ్విని జూన్‌ 24వ తేదీన సాయంత్రం ఓ ప్రైవేట్‌ స్కూల్‌ లో చదువుతున్న తన పిల్లలని తీసుకురావడానికి ఇంటి నుంచి నడుచుకుంటూ వెళ్తుంది. మార్గమధ్యలో వెనుకాల నుంచి బైక్‌ పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు అడ్రస్‌ అడుగుతున్నట్లు నటించి ఆమె మెడల నుంచి బంగారు చైన్‌ లాక్కొని వెళ్లిపోయారు. బాధితురాలు అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలం వద్ద సీసీ కెమెరాలు పరిశీలించారు. సీసీ కెమెరా ఆధారంగా పోలీసులు వికారాబాద్‌ జిల్లా తాండూర్‌ మండలం అచ్చపురం గ్రామానికి చెందిన హనుమంతు, మెదక్‌ జిల్లా శంకరంపేట్‌ మండలం మల్కాపూర్‌ గ్రామానికి చెందిన చాకలి సంగమేశ్వర్‌లను అమీన్‌పూర్‌ పరిధిలో ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి బంగారు చైన్‌తోపాటు బైక్‌ను స్వాధీనం చేసుకొని ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో కీలకపాత్ర పోషించిన సీఐ నాగరాజు, క్రైమ్‌ సీఐ శేఖర్‌ సిబ్బందిని డీఎస్పీ రవీందర్‌ రెడ్డి అభినందించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

పటాన్‌చెరు టౌన్‌: విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్‌ రాష్ట్రానికి చెందిన సాయిద్‌ హుల్లా బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు మండలం చిట్కుల్‌ ఓ వెంచర్‌లో ఉంటూ పాల్‌సీలింగ్‌ పని చేస్తున్నాడు. అయితే ముత్తంగి గ్రామంలో నర్సింహులు ఇంటి నిర్మాణం చేస్తున్నారు. ఆదివారం సాయిద్‌ హుల్లా పెద్ద కుమారుడు కరీముల్లా(29) నిర్మాణంలో ఉన్న భవనం రెండో అంతస్తులో పాల్‌సీలింగ్‌ పనులు చేస్తుండగా కరెంట్‌ షాక్‌ కొట్టింది. వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి సాయిద్‌ హుల్లా ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య



శివ (ఫైల్‌)

శివ్వంపేట(నర్సాపూర్‌) : యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధి దొంతిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సోము శివ(21) ఎలాంటి పని చేయకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. గతేడాది బోనాల పండుగ రోజున గ్రామంలోని విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుడి చేయి పూర్తిగా కోల్పోయాడు. ఆదివారం బోనాల పండుగ రోజు ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశ్యంతో మరోమారు అదే ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద విద్యుత్‌ వైరు పట్టుకోవడంతో కరెంట్‌ షాక్‌ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు

● మంచాన పడ్డ ఇంటి యజమాని
● భార్య, తల్లి సైతం అనారోగ్యంపాలు
● ఆదుకోవాలంటూ వేడుకోలు



కుటుంబ సభ్యులతో హనీఫ్‌

మిరుదొడ్డి(దుబ్బాక): రోడ్డు ప్రమాదంలో కాలు పోగొట్టుకున్న ఓ ఇంటి యజమాని ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని అల్వాల గ్రామానికి చెందిన ఎండీ. హనీఫ్‌ ఎలక్ట్రీషన్‌గా పనులు చేస్తూ భార్య రెహమాన్‌జీ, ఇద్దరు కుమారులు అమీర్‌ అంజా, అఫ్రీద్‌, కూతురు రియా అస్మిరాతోపాటు తల్లి గౌసియా బీతో ఉన్నంతలో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆరు నెలల కిందట పనుల నిమిత్తం దుబ్బాకలో ఎలక్ట్రీషన్‌ పనులు ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి తిరిగి వస్తున్న క్రమంలో మిరుదొడ్డి ఆరెపల్లి శివారులో ఉన్న సదానందాశ్రమం వద్ద ఆటో, బైక్‌ ఢీకొన్నాయి. ప్రమాదంలో హనీఫ్‌ కుడి కాలు, పక్కటెముకలు విరిగిపోయాయి. చికిత్స కోసం అందినకాడికి సుమారు రూ.10 లక్షల వరకు అప్పులు చేయాల్సి వచ్చింది. కాలు తొలగించకపోతే ప్రాణానికే ప్రమాదమని డాక్టర్లు హెచ్చరించారు. దీంతో విధి లేని పరిస్థితుల్లో కుడి కాలును తొలగించడంతోపాటు, పక్కటెముకలను సరి చేయడానికి ఆపరేషన్‌ చేయాల్సి వచ్చింది.

దయనీయంగా కుటుంబ పరిస్థితి

కుటుంబ బరువు బాధ్యతలను మోసే యజమాని ఎడమ కాలు తీసేయడంతో కాలుకు ఇన్‌ఫెక్షన్‌ వచ్చింది. హనీఫ్‌ తల్లికి షుగర్‌, బీపీ ఉండటంతో మందులు కొనలేని పరిస్థితి నెలకొంది. భార్య రెహమాన్‌జీకి థైరాయిడ్‌ వ్యాధితో బాధపడుతూ నిత్యం అవస్థలు పడుతోంది. ఆమె బీడీలు చుట్టగా వచ్చే బడ్వాడాతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఇక హనీఫ్‌ పెద్ద కొడుకు అమీర్‌ అంజా డిగ్రీని మధ్యలోనే మానేసి సిద్దిపేటలోని ఓ బట్టల దుకాణంలో కూలీ పనులు చేయాల్సి వస్తోంది. ఇంట్లో ఏ ఒక్కరికి కూడా ప్రభుత్వ పెన్షన్‌ లేకపోవడంతో కుటుంబ సభ్యుల జీవనం నల్లేరుపై నడకలా మారింది. మందులు కొనడానికి చేతిలో చిల్లిగవ్వ లేక అనారోగ్యంతో మరింత ఇబ్బందులు పడుతున్నారు. దీనావస్థలో ఉన్న తమ కుటుంబాన్ని దాతలు 91772 08079 నంబర్‌లో సంప్రదించి ఆర్థిక సాయం చేయాలని వేడుకుంటున్నారు.

47 రోజులు.. 3,500 కిలో మీటర్లు

● సౌత్‌ ఇండియాను చుట్టేసిన గొల్లపల్లికి చెందిన యువకుడు
● పర్యావరణ పరిరక్షణకు సైకిల్‌యాత్ర
● ఐదు రాష్ట్రాల్లో అవగాహన



సైకిల్‌యాత్రలో యువకుడు శివకోటి

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): ఒక ఆలోచన యాత్ర చేసేలా చేసింది.. ఒక పట్టుదల పది మందికి అవగాహన కల్పించేలా నడిపించింది..ఒక రోజు కాదు రెండు రోజులు కాదు 47 రోజులు సైకిల్‌ యాత్రతో సౌత్‌ ఇండియా మొత్తం చుట్టేశాడు యువకుడు.. సేవ్‌ పొల్యూషన్‌, సేవ్‌ వాటర్‌, సేవ్‌ ట్రీ పై ఐదు రాష్ట్రాల్లో అవగాహన యాత్ర చేపట్టారు జగదేవ్‌పూర్‌ మండలంలోని గొల్లపల్లికి చెందిన శివకోటి అనే యువకుడు.

సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన చిప్ప శివకోటి పదవ తరగతి పూర్తి చేసిన అనంతరం ఇంజనీరింగ్‌ డిప్లొమా పూర్తి చేశారు. ఈసీఐఎల్‌ ఈవీఎం ఎలక్ట్రానిక్‌ కంపెనీలో అప్రెంటీస్‌గా ఉద్యోగంలో చేరాడు. కంపెనీలో ఉద్యోగం చేస్తున్న క్రమంలో వచ్చిన ఆలోచన సౌత్‌ ఇండియా యాత్రకు శ్రీకారం చుట్టారు. పర్యావరణ పరిరక్షణ, నీటి పొదుపు, చెట్ల పెంపకం లాంటి వాటిపై యువతకు అవగాహన కల్పించడానికి సైకిల్‌ యాత్రకు సిద్ధమయ్యారు. మే 27న గొల్లపల్లి నుంచి సైకిల్‌యాత్రను ప్రారంభించారు.

47 రోజుల ఐదు రాష్ట్రాల్లో..

శివకోటి చేపట్టిన సైకిల్‌యాత్ర ఐదు రాష్ట్రాలు సౌత్‌ ఇండియా మొత్తం పూర్తి చేశారు. సొంత గ్రామమైన గొల్లపల్లి నుంచి మే 27న ప్రారంభించి జూలై 18కి గొల్లపల్లికి చేరుకున్నాడు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో శ్రీశైలం, నెల్లూరు, శ్రీకాళహస్తి, తిరుపతి, కాణిపాకం, వెల్లురు, తిరువనమలై, మధురై, తిరువయ్యార్‌, తంజవూర్‌, రామేశ్వరం, దనుష్‌కొడి, కన్యకుమారి, త్రివేంద్రం, జటయు, త్రిచి, మున్నార్‌, కొడైకెనల్‌, గుణ, కోయంబత్తూర్‌, బెంగుళూర్‌ పర్యాటర ప్రాంతాలల్లో పర్యటిస్తూ అక్కడి ప్రజలకు అవగాహన కల్పిస్తూ సైకిల్‌ యాత్ర చేపట్టారు. 47 రోజులు సౌత్‌ ఇండియా సైకిల్‌యాత్ర పూర్తి చేసుకొని ఇంటికొచ్చిన శివకోటిని గ్రామస్తులు శాలువాలు కప్పి సన్మానించారు.

వరి సాగు ఆశాజనకం

● పెరుగుతున్న సాగు విస్తీర్ణం
● మండలవ్యాప్తంగా 25 వేలు ఎకరాలు
● విస్తారంగా కురుస్తున్న వర్షాలు
● రైతుల్లో సంతోషం



వరి నాట్లు వేస్తున్న కూలీలు

కోహెడ(హుస్నాబాద్‌): వానాకాలం వరి సాగు ఆశాజనకంగా ఉంది. కురుస్తున్న వర్షాలకు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. మండలవ్యాప్తంగా సుమారు 25 వేలు ఎకరాల్లో వరి సాగు కానుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం 10 వేలు ఎకరాలు సాగు పూర్తయినట్లు సమాచారం. ఇంకా పక్షం రోజులపాటు ముమ్మరంగా సాగు కానుందని చెబుతున్నారు.

బావుల్లో పెరుగుతున్న నీరు

వ్యసాయ, బోరు బావుల్లో నీటి మట్టం వర్షాలతో రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో రైతులు వరి నాట్లు వేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. వాతావరణ శాఖ అందిస్తున్న సమాచారం ప్రకారం ఇంకా వర్షాలు సంవృద్ధిగా కురవనున్నట్లు తెలుస్తోంది. దీంతో రైతుల ముఖాల్లో పట్టరాని సంతోషం కనబడుతోంది. అలాగే వరి నాట్లుకు అవసరం ఉన్న డీఏపీ, 20.20, 17.17.17, 16. 20. 0.13, 10.26 తదితర రకాల మందులను వారు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఫర్టిలైజర్‌ షాపుల వద్ద రద్దీ కనిపిస్తోంది.

కూలీ కొరత.. పెరిగిన రేట్లు

రైతులు ఒక్కసారిగా వరి నాట్లు పట్టడంతో కూలీల కొరత తీవ్రమైంది. దీంతో కూలి రెట్లు సైతం పెరిగాయి. గతంలో రూ.300 ఉంటే ఇప్పుడు కూలి రూ.50 పెరిగింది. దీంతో ఒక్కో కూలీకి రూ.350లు చెల్లిస్తున్నారు. అలాగే కొంతమంది రైతులు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌, బిహార్‌ తదితర రాష్ట్రల నుంచి వచ్చిన వలస కూలీలతో మాట్లాడుకుని ఎకరానికి రూ.6 వేలు వరకు చెల్లింపులు చేస్తున్నారు.

ఆరెకరాలు సాగు చేస్తున్నా



ఆరు ఎకరాల్లో వరి నాట్లు వేశాను. గతేడాది నీటి కొరత, కత్తెర పురుగు, మొగిపురుగు, పచ్చపురుగుతో లాభం రాకుండా పోయింది. ఇప్పుడు వర్షాలు మంచిగానే కురుస్తున్నాయి. ఇంకా వర్షాలు కురుస్తాయని వార్తలు ద్వారా సమాచారం తెలిసింది. బావిలో పంటకు సరిపడా నీళ్లున్నాయి. కాగా, వారం నుంచి కూలీల కొరత తీవ్రంగా ఉంది. ఇతర రాష్ట్రాల నుంచి వలస కూలీలు వచ్చినా సరి పడేంత మంది లేరు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానించాలి.

– వెల్ది ఆనందరావు, రైతు కోహెడ

అప్పటి వరకు నాట్లు..




వచ్చనెల 20వ తేదీ వరకు నాట్లు వేసుకోవచ్చు. దొడ్డు రకం 35 రోజులు, సన్న రకం 45 రోజుల లోపు నాట్లు వేసుకోవచ్చు. దిగుబడిలో ఎలాంటి ఇబ్బంది తలెత్తదు. సన్న రకానికి నాట్లు వేసేటప్పుడు పాయలుగా వేయాలి. దీంతో వరి చేనుకు గాలి తగిలి దోమపోటుకు గురి కాకుండా ఉంటుంది. దిగుబడి లాభాసాటిగా ఉంటుంది.

– భోగేశ్వరస్వామి, ఏఓ కోహెడ

పారిశుద్ధ్య కార్మికుడి ప్రాణం తీసిన కారు

● ఉదయం పనులు చేస్తుండగా ఢీకొని అక్కడికక్కడే మృతి
● మెదక్‌ పట్టణ కేంద్రలో ఘటన



మైసయ్య (ఫైల్‌)

మెదక్‌ మున్సిపాలిటీ: కారు ఢీకొని పారిశుద్ధ్య కార్మికుడు మృతి చెందిన ఘటన ఆదివారం మెదక్‌ పట్టణంలోని వడ్డెర కాలనీలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మెదక్‌ మండలం మక్త భూపతిపూర్‌ గ్రామానికి చెందిన కర్రొల్ల మైసయ్య(55) మెదక్‌ మున్సిపల్‌లో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం 4 గంటలకు మెదక్‌ మున్సిపల్‌లో పారిశుద్ధ్య పనులు చేసేందుకు వచ్చాడు. ఉదయం 6.30 గంటల ప్రాంతంలో మంభోజిపల్లి వైపు నుంచి వేగంగా వచ్చిన కారు అదుపు తప్పి మైసయ్యను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో కారు నడుపుతున్న యువకుడు, అతడి స్నేహితులు పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలా నికి చేరుకొని మైసయ్య మృతదేహాన్ని మెదక్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇదే ప్రమాదంలో కాలనీకి చెందిన 11 ఏళ్ల బాలుడు సైతం గాయపడ్డాడు. దీంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌ తరలించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మైసయ్య కుటుంబాన్ని పలువురు పరామర్శించారు. మృతుడి భార్య రత్నమ్మ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.